రెగ్యులర్ చేయాలి

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్షలకు ఎపిటిఎఫ్ సంఘీభావం

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు బంకురు జోగి నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి 20ఏళ్లుగా పని చేస్తున్న వారిని రోడ్డున పడేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 38 రోజులుగా పోరాట చేస్తున్న ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం సరైంది కాదని అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం నాయకులు దివాకర్, రమేష్, శ్రీను, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణే ధ్యేయం

- స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయండి
- జీపుజాతాలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడమే ధ్యేయంగా యుటిఎఫ్ మొదటి నుంచి పోరాడుతోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు మురళీమోహన్‌రావు, కిశోర్‌కుమార్ చెప్పారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 26 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార యాత్ర జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తొలుత పాలకొండలో ప్రచార యాత్రను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిషోర్ కుమార్, ఎస్ మురళీమోహనరావు ప్రారంభించారు. అనంతరం శుక్రవారం ఈ జాతా పార్వతీపురం చేరింది. ఈ సందర్భంగా కిశోర్ కుమార్ మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5, 6, 7 ,8 తేదీల్లో స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ధ్యేయంగా యుటిఎఫ్ మహాసభలు జరుగుతున్నాయని, ఉపాధ్యాయులంతా ఈ సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం ప్రధాన కర్తవ్యంగా ఉండాలని, రాజ్యాంగ లక్ష్యాలను, విలువలను కాపాడుకోవాలని కోరారు. జిల్లా ఉద్యమంలో యుటిఎఫ్‌కి ఒక ఘనమైన చరిత్ర ఉందని, అధికారుల అవినీతిని వ్యతిరేకించి ఉపాధ్యాయులను రక్షించుకోవడం కోసం అనేక పోరాటాలు యుటిఎఫ్ చేసిందని గుర్తు చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి రమేష్, కె.భాస్కరరావు మాట్లాడుతూ జనవరి 5న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా జరిగే విద్యా సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని, అలాగే వివిధ రాష్ట్రాల విద్యాశాఖ ప్రముఖులు, మంత్రులు పాల్గొంటారని తెలిపారు. సాంస్కృతిక, ఆర్థిక రంగంపై మహిళా సదస్సులు కూడా నిర్వహిస్తున్నామని, వేలాదిగా ఉపాధ్యాయులు కాకినాడ పట్టణానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

సీతంపేట : యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల ఎదురుగా ప్రచార యాత్ర నిర్వహించారు. పాలకొండలో ప్రారంభమైన ప్రచార యాత్ర సీతంపేట చేరుకుంది. యాత్రలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు, ఎస్ కిషోర్ కుమార్, ఎస్ మురళీమోహనరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, జిల్లా గౌరవ అధక్షులు ఆరిక భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు మండల వ్యవస్థాపకులు సింహాచలం, ప్రధానోపాధ్యాయులు టి.చందర్రావు, డిప్యూటీ వార్డెన్ రామ్మోహన్‌రావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతా సీతానగరం చేరుకుంది. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు కిశోర్‌కుమార్, మురళీమోహనరావుతో పాటు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లి శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు తీళ్ల మధుసూధనరావు, సహాధ్యక్షులు అంది పోలినాయుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూరాడ ఆదినారాయణ, మండల కౌన్సిల్ సభ్యులు జాగాన సింహాచలం, వెన్నెల తవిటినాయుడు, ఓలేటి గిరి, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు : యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతా సాలూరు పట్టణానికి చేరుకుంది. జాతా ప్రాముఖ్యతను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.మురళీమోహనరావు, ఎస్.కిశోర్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు జానకీరాం, రామకృష్ణ, సాలూరు, పాచిపెంట మండలాల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రక్తహీన రహిత జిల్లాగా చేద్దాం

- డ్వాక్రా మహిళలు బాధ్యత తీసుకోవాలి
- పండగ నుండి పౌష్టికాహార కిట్లు
- గర్భిణులు వైటిసిని వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - మక్కువ

గర్భిణీలు సుఖ ప్రసవం కలగాలంటే రక్తహీనత లేకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, అంతా కలిసి రక్తహీనరహిత జిల్లాగా జిల్లాను తీర్చిదిద్దుకుందామని కలెక్టర్ ఎ.శ్యాంపసాద్ అన్నారు. మండలంలోని పనసభద్రలో శుక్రవారం ఎనిమిక్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకుకూరలు, పాలు, గుడ్లు, వేరుశనగ బెల్లంతో కూడిన ఉండలు తరచూ ఆహారంలో తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. అలాగే రాగిజావ కూడా తీసుకోవాలన్నారు. హెచ్‌బి లెవెల్ దాదాపు 11 పాయింట్లు దాటేలా గర్భిణీలు చూసుకోవాలన్నారు. సాలూరులో గర్భిణీల కోసం ఏర్పాటు చేసిన వైటీసీలో కేవలం 12 మంది మాత్రమే ఉన్నారని, సుమారు 50 మంది వరకు అక్కడ ఉండవచ్చని ఆయన అన్నారు. గర్భిణీ తో పాటు ఒక వ్యక్తి కూడా అక్కడే ఉండొచ్చన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహార కిట్లతో కలెక్టర్ తరపున రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీలకు సంక్రాంతి నుంచి ఆదనంగా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల నిర్వహించిన పీసా గ్రామసభల్లో మూడు గ్రామాలకు మాత్రమే సమాచారం ఇచ్చారని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గిరిధర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సురాపాడు రిజర్వాయర్‌ను అభివృద్ధి చేయాలని, అలాగే చెక్కవలస రహదారిని బిటి రోడ్డుగా మార్చాలని అన్నారు. చెక్కవలస ఎత్తిపోతల పథకాన్ని బాగు చేయాలని ఈ సందర్భంగా గిరిజనులు కలెక్టరును కోరారు. వీటిని పరిశీలించి తగు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు దబ్బగెడ్డ పంచాయతీ పరిధిలోని అనసభద్ర ప్రాథమిక పాఠశాలను సందర్శించి కాసేపు విద్యార్థులతో గడిపారు. అనంతరం పల్లె పండుగ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్: జిల్లా అధికారుల సహకారంతో జిల్లాలో రక్తహీనత నివారణ సాధ్యమనిసబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాస్తవ అభిప్రాయపడ్డారు. మండలంలోని కృష్ణపల్లిలో ఎనిమియా యాక్షన్ కమిటీ సమావేశం శుక్రవారం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన జిల్లా అధికారులకు, వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో రక్తహీనతతో ఉన్న గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత సమస్య ఉన్న వారి హిమోగ్లోబిన్ శాతం వివరాల రికార్డును పరిశీలించారు. కొందరిలో కనిష్ఠ స్థాయి కన్నా హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండడాన్ని గమనించిన సబ్ కలెక్టర్ ఇకపై ప్రతి నెలా హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రక్తహీనతను గుర్తించే ముందు అందుకు గల కారణాలను విశ్లేషించి, వారి ఆరోగ్యం మెరుగుకు కృషి చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రం నుంచి అందించే పౌష్టికాహారం (టిహెచ్‌ఆర్) గర్భిణీలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న ప్రభుత్వ సేవలను, ఆరోగ్యపరంగా తలెత్తే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేసి గర్భిణీలు, బాలింతలు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు ప్రతీ రోజూ నిర్దేశించిన ప్రకారం తీసుకునేలా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ విషయమై వారి కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, సిడిపిఒ బి.శ్రీనివాస్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పాలకొండ : ఐటిడిఎ పరిధిలో రక్తహీనత (అనీమియా) ఎక్కువగా ఉందని, దీంతో ఏ ఒక్క తల్లీ బిడ్డకు ఎటువంటి ప్రమాదం జరగకుండా అన్ని ముందస్తు చర్యలను చేపడుతున్నట్లు సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని కొండాపురం గ్రామాన్ని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.ఎస్.మన్మథరావుతో కలిసి సబ్ కలెక్టర్ సందర్శించారు. ఈ గ్రామంలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల ఇళ్ల వెళ్లి పరామర్శించారు. గర్భిణుల రికార్డులను పరిశీలించిన ఆయన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా పోషకాహారాన్ని అందిస్తుందని, వాటిని సక్రమంగా తీసుకోవాలని సబ్ కలెక్టర్ తెలిపారు. గర్భిణీలు ఆహారంలో ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని, గుడ్లు, పాలు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని వివరించారు. పర్యటనలో అన్నవరం పిహెచ్‌సి వైద్యాధికారి, ఎఎన్ఎంలు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

90 లక్షల లీటర్ల పాలు సరఫరా

ఎపి డెయిరీ రీజనల్ సేల్స్ మేనేజర్ రామకోటేశ్వరరావు వెల్లడి

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్రంలో 55,607 అంగన్వాడీ కేంద్రాల ద్వారా సుమారు 90 లక్షల లీటర్లు పాలు చిన్నారులకు సరఫరా చేస్తున్నామని ఎపి డెయిరీ రీజనల్ సేల్స్ మేనేజర్ పి.రామ కోటేశ్వరరావు విలేకరులకు తెలిపారు. మిల్క్ స్టాక్ పాయింట్లు తనిఖీలో భాగంగా శుక్రవారం ఆయన పాచిపెంట విచ్చేశారు. పాచిపెంట స్టాక్ పాయింట్‌లో పాలపాకెట్లను పరిశీలించారు. పాల బాక్సులు నెట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. పాల ప్యాకెట్లపై లేబుల్, బ్యాచ్ నెంబర్ తనిఖీ చేశారు. గత నెలకు ఈ నెలకు సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం పార్వతీపురం, పాచిపెంట, బలిజిపేట, రామభద్రపురం స్టాక్ పాయింట్లను పరిశీలించామని తెలిపారు. రాష్ట్రంలోని 257 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో గల 55,607 సెంటర్ల ద్వారా 90 లక్షల లీటర్ల పాలు నెలకు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాలకు విజయ్ వజ్ర ప్రైవేట్ సంస్థ ద్వారా మిల్క్ సప్లై జరుగుతుందన్నారు. ఈ పాలు ఆరు మాసాల నుంచి ఆరేళ్ల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. గర్భిణీలు, పిల్లల తల్లులకు పాలు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. తాను జిల్లాలో పర్యటించినప్పుడు ఏ స్టాక్ పాయింట్‌లోనూ లోపాలు కనిపించలేదని, అన్నీ సక్రమంగా నడుస్తున్నాయని తెలిపారు. జిల్లాలో నెలకు 2 లక్షల 81 వేలు లీటర్లు పాలు సరఫరా చేస్తామని తెలిపారు. పాలు సరఫరా వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలిగి పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మిల్క్ సప్లై కాంట్రాక్టర్ పవణ్ కుమార్ పాల్గొన్నారు.

మిల్క్ స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున సేల్స్‌మేనేజర్ రామకోటేశ్వరరావు

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వార్షిక తనిఖీల్లో భాగంగా ఎఎస్‌పి అంకిత సురాన శుక్రవారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ నిమిత్తం సందర్శించారు. ఆమెకు రూరల్ సర్కిల్ సిఐ గోవిందరావు, ఎస్సై సంతోషి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలోని ఎస్‌హెచ్‌ఒ, రైటర్, కంప్యూటర్, రిసెప్షన్ సిబ్బంది గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపర్చిన గదులను, సీజ్ చేసిన వాహనాలను, స్టేషన్ చుట్టుపక్కల పరిసరప్రాంతాలను పరిశీలించారు. పోలీసు స్టేషనులో నమోదై దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యాయ స్థానాల్లో ట్రయల్స్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడీ ఫైల్స్‌ను ఎఎస్‌పి పరిశీలించి, కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. లాంగ్ పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని, కేసుల్లో నిందితులు శిక్షింపబడేలా సాక్ష్యాలను, సాంకేతిక ఆధారాలను సేకరించి, దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. రిసెప్షన్ వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది విధుల గురించి అడిగి తెలుసుకొని, ఫిర్యాదు దారుల పట్ల మసులుకొనే పద్ధతుల పట్ల తగు సూచనలు చేశారు. అనంతరం మహిళా పోలీసులతో సమావేశమై వారి విధులను అడిగి తెలుసుకొని, వారికి గ్రామ స్థాయిలో ప్రజల్లో గంజాయి వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

కార్యక్రమంలో సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం కలేనా?

ప్రజాశక్తి - కొమరాడ

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. శుక్రవారం వంతెన నిర్మిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇదిగో పనులు పూర్తి చేస్తాం అదిగో చేస్తామని ప్రకటనలు ఇవ్వడం తప్ప 20 శాతం పని కూడా చేయని పరిస్థితి ఉందని అన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా వంతెన పనులపై కనీసం దృష్టి పెట్టే పరిస్థితి కనిపించకపోవడం దారుణమని అన్నారు. కేవలం మూడు పిల్లర్ల నిర్మాణానికి 18 ఏళ్లు కాలయాపన చేసే పరిస్థితి ఉందన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నో నిరసన కార్యక్రమాలు ఆందోళన చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పులు లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్మాణం పనులు ప్రారంభించి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ప్రిన్సిపల్ వికృత చేష్టలు

- తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు
- ప్రిన్సిపల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి-వీరఘట్టం

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపాలే వారిపట్ల వికృత చేష్టలకు పాల్పడుతున్న ఘోర సంఘటన మండలంలోని గురు బ్రహ్మ పాఠశాలలో చోటు చేసుకుంది. ఆ వికృత చేష్టల వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆ ప్రిన్సిపాల్‌పై విరుచుకుపడ్డారు.

మండలం నడుకూరు గ్రామ సమీపంలోగల గురుబ్రహ్మ పాఠశాల 1 నుంచి 7వ తరగతి వరకు 86 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ తెర్లి సింహాచలం కొంతకాలంగా విద్యార్థుల పట్ల వికృత చేష్టలకు పాల్పడుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పిల్లలు తల్లిదండ్రుల దగ్గర భయపడి విషయం చెప్పక పోయినప్పటికీ గుర్తుతెలియని వ్యక్తి ద్వారా వీడియో హల్ చల్ చేయడంతో తల్లిదండ్రులంతా శుక్రవారం పాఠశాల వద్దకు చేరుకొని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ జి.కళాధర్ ఘటన స్థలానికి చేరుకొని ప్రిన్సిపాల్ అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కి తరలించారు. తల్లిదండ్రులంతా తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్మన్‌గా పల్లా ప్రతాప్ బాధ్యతలు స్వీకరించడంతో శుక్రవారం ఆయన స్వగృహంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఫోరం కన్వీనర్ నూతలపాటి భరత భూషణ్‌రాజ్, గ్రంథాలయ ఉద్యోగులు సంఘం రాష్ట్ర కార్యదర్శి గణేష్ బాబు, లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ కలిసి సన్మానించారు.

13 గ్రామాల్లో పీసా ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - సీతంపేట

పీసా ఎన్నికలలో భాగంగా శుక్రవారం నిర్వహించిన 14 గ్రామసభలలో 13 గ్రామాల్లో ఏకగ్రీవం కాగా లోకొత్తవలస గ్రామంలో ఎన్నికలు జరిగినట్లు పీవో సి యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం 15 గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహించనున్నట్లు పీవో తెలిపారు.

గులిరాగి పంట పరిశీలన

సీతంపేట: మండలంలోని దిగువ కులవరాయిలో శుక్రవారం స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్ఆర్పి దేవుళ్ళు అరిక గంగాన్న రైతు సాగు చేసిన గులిరాగి పంటను పరిశీలించారు. సూచనలు సలహాలు ఇచ్చారు. బుడగరాయిలో సవర వెంకటరావు గులి రాగి పంటను పరిశీలించారు. గుళి రాగి పంట నారుమూడులను పరిశీలించారు. 8రకాల అంతర్ పంటలు వరుస పద్ధతుల వేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఎం షణ్ముఖ రాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపుపై వైసిపి నిరసనలు



సాలూరు : పోరుబాటలో పాల్గొన్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్/కురుపాం/సాలూరు/పాలకొండ

ప్రజలపై వేసిన విద్యుత్ ఛార్జీల అదనపు భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో మాజీమంత్రులు, మాజీఎమ్మెల్యే ఆధ్వర్యాన విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద నిరసన తెలుపుతూ అధికారులకు వినతులు అందజేశారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి నిర్వహించిన పోరుబాట లో భాగంగా రాజన్నదొర ఆధ్వర్యాన వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజన్నదొర నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరి విద్యుత్ ఎడిఇ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఊరూరా ప్రచార సభల్లో ఊదరగొట్టారని చెప్పారు. ఇప్పుడెలా ప్రజలపై భారాలు వేశారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ లకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అని చెపుతూ వారికి వేలాది రూపాయల విద్యుత్ బిల్లులెలా విడుదల చేస్తున్నారని నిలదీశారు. ఇచ్చిన హామీ లు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని అన్నారు. అధికారం చేపట్టి ఆరునెలలైనా ఇంతవరకు సూపర్ సిక్స్ హామీల పై స్పష్టత లేదని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి సిద్ధమేనని రాజన్నదొర చెప్పారు. అనంతరం విద్యుత్ ఎడిఇ రంగారావు కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, మండల వైసిపి అధ్యక్షులు భరత్‌శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో భారీ ర్యాలీతో పోరుబాట కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలో గల పట్టణంతో పాటు మూడు మండలాల వైసిపి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి వైసిపి విగ్రహం నుంచి భారీ ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కుటుంబ ప్రభుత్వం నుంచి ఆరు నెలల్లోనే అన్ని రకాల ఇబ్బందులు మొదలయ్యాయని, తక్షణమే పెంచిన ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు.కార్యక్రమంలో మూడు మండలాల ప్రజా ప్రతినిధులు చైర్మన్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపిపిలు, కౌన్సిలర్లు, సర్పంచులు కార్యకర్తలు నాయకలు పాల్గొన్నారు.

కురుపాంలో కరెంటు చార్జీల బాదుడుపై మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్పశ్రీవాణి, జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షత్ రాజు ఆధ్వర్యాన పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక పెట్రోల్ బంక్ నుంచి నియోజకవర్గంలో గల వైసిపి నాయకులు కార్యకర్తలతో ర్యాలీగా సబ్ స్టేషన్ వరకు వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం ఎడికి విద్యుత్ చార్జీలు బాదుడుపై వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిచో ప్రజల పక్షాన నిరంతరం వైసిపి పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎం.బాపూజీనాయుడు, ఐదు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు ,వైసిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్‌ఛార్జీల బాదుడుపై పాలకొండలో పోరుబాట ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ పెంచిన ఛార్జీలను వెంటనే తగ్గించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్తు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్, పట్టణ అధ్యక్షులు మన్మథరావు, వీరఘట్టం ఎంపిపి దమలపాటి వెంకటరమణ, వైసిపి నాయకులు ధవళేశ్వరరావు, లిల్లీ పుష్పనాదం తదితరులు ఉన్నారు.

కురుపాంలో సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

పార్వతీపురంలో పోరుబాట నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం జరగ్గా సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. ఎంపిపి బొమ్మాలి భాను అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపిడిఒ విజయ రంగారావును బడ్జెట్ ప్రవేశపెట్టారు. 2025-26 సంవత్సరానికి రూ.90,94,122 ప్రారంభ నిల్వ కాగా, రూ.కోటీ 26లక్షల 51,067 ముగింపు నిల్వగా చూపించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో పనులు మెజార్టీ సభ్యుల అభిప్రాయంతో జరగాలన్నారు. లేదకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 30న జరగనున్న మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌పే విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ- 2 ఆర్.ఆనందరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర)లో ప్రధాన ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల చదువులు మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి బిల్లులు కూడా సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌సి, సిఆర్ఎంటి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఏనుగులు ధ్వంసం చేసిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పంట నష్టాలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సుంకిలో ఇటీవల అడవి ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన వరి, అరటి పంటలను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నష్టాన్ని అధికారులు వెంటనే అంచనావేసి బాధితులను ఆదుకోవాలని ఆదేశించారు. పంట నష్టం అంచనా నివేదికను తనకు అందజేస్తే సిఎంతో మాట్లాడి బాధితులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదన రావు, నాయకులు మర్రాపు పురుషోత్తమనాయుడు, మరడాన తవిటినాయుడు, అంబటి రాంబాబు, సుంకి సర్పంచ్ కె. రవీంద్ర, ఎంపిటిసి సభ్యులు ఎంబి విజయ అంకుశం, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రమేష్

న్యాయ సలహాకు డయల్ 15100

ప్రజాశక్తి - మక్కువ

మహిళలు తమ హక్కులను కాపాడుకునేందుకు ఎలాంటి సంకోచం ఉండకూడదని, కోర్టు మెట్ల ఎక్కాలని భయపడొద్దని సాలూరు కోర్టు జడ్జి రమేష్ అన్నారు. శుక్రవారం విధాన్సే సమాధాన్ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద మహిళలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహహింస చట్టం ఉద్యోగినుల హక్కుగా ఉండే మెటర్నటీ సెలవులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు వాటిని ఎదుర్కొనే స్థితిగతులపై మహిళలకు వివరించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలకు 15100 ఫోన్ నెంబర్ గల గోనెసంచులను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు టి.తిరుపతిరావు, తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, సీనియర్ న్యాయవాది విఎస్ శర్మ, ఎంపిడిఒ స్వరూప రాణి వెలుగు సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ ఎంఎస్ రాణి

కిశోర వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామ సచివాలయ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీస్, ఎఎన్ఎంకు శుక్రవారం సిడిపిఒ సుగుణ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రత్యేక అధికారి కరుణాకర్ కిశోర వికాసంపై అంతా దృష్టి పెట్టాలని, బాలబాలికలుకు దీనిపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి మాట్లాడుతూ కిశోరి వికాసంపై అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, విఎఒలు, ఎఎన్ఎంలు ప్రతి ఒక్కరూ దీనిపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించి దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఎంఇఒ సూరిదేముడు, సీతానగరం, బలిజిపేట సూపర్వైజర్లు పాల్గొన్నారు. శనివారం సీతానగరం పిహెచ్‌సి పరిధిలో గల సచివాలయాలకు శిక్షణ ఇవ్వనున్నట్టు సిడిపిఒ సుగుణ తెలిపారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని పురోహితునివలసలో లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా విక్రయిస్తున్న వంద నాటుసారా ప్యాకెట్లును పోలీసులు పట్టుకున్నారు. నాటు సారా విక్రయిస్తున్న దివ్వెల రామారావును అదుపులోకి తీసుకొని నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎస్వి రామారావు, హెచ్‌సి జి.సుదర్శనకుమార్, కానిస్టేబుళ్లు బి.రాము, జె.జనార్ధనరావు ఉన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల కురుపాం, గుమ్మలక్ష్మీపురం సచివాలయాల పరిధిలో గల గ్రామాల్లో నిర్వహించిన కంటి వెలుగు నేత్ర వైద్య శిభిరల్లో నిర్వహించిన నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం) టేరిజియం (కొయ్యకండ) లోపం ఉన్న వారిని గుర్తించి వారికి శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి పుష్పగిరి కంటి ఆసుపత్రికి నేత్ర చికిత్సల కోసం తరలించినట్లు నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందులు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

ఏజెన్సీలో కళాజాతాలతో అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

ఏజెన్సీ గ్రామాల్లో పివిటిజి గిరిజనులకు అవగాహన కల్పించేందుకు నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన కళాజాత బృందాలు ప్రచారం నిర్వహించాయి. మండలంలోని గదబబొడ్డవలసలో శుక్రవారం బుర్ర కథ ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, చేతులు శుభ్రం చేసుకోవడం, రక్తహీనత, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు వంటి అంశాలపై కళాజాత బృందాలు అవగాహన కల్పించాయి. ఈ సందర్భంగా నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ శుక్రవారం సాలూరు మండలం గదబబొడ్డవలస, రేగాపువలస,బూతాడ కర్రివలస, జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడి, గదబవలస, చిలకవానివలస, పాండులవలస గ్రామాల్లో రెండు కళాజాత బృందాలు ఆదివాసీ గిరిజనులకు అవగాహన కల్పించాయని చెప్పారు.పివిటిజి గ్రామాల్లో గిరిజనులకు వారి గిరిజన భాషలో అర్థమయ్యేలా అవగాహన కల్పించినట్లు చెప్పారు. 50 గిరిజన గ్రామాల్లో అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మోహన్ రావు, కళా బృందాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాల్

దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయింది

ప్రజాశక్తి - పార్వతీపురం

దేశం గర్వించదగ్గ గొప్ప ఆర్థిక వేత్తను కోల్పోయిందని కాంగ్రెస్ ఒబిసి రాష్ట్ర చైర్మన్ సొంటి నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఒబిసి సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక వేత్త నుంచి దేశ ప్రధాని వరకు ఎదిగిన కొద్దీ ఒదిగి ఉన్న గొప్ప నాయకుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కన్వీనర్ శాంతికుమారి, పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త బత్తిన మోహన్‌రావు, సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రామకష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మాజీ ప్రధాని, చిత్రపటానికి నియోజకవర్గ నాయకులతో కలిసినివాళులర్పించారు. ఆర్థిక

మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

మాజీ ప్రధాని మన్మోహన్‌కి ఘన నివాళి

మన్మోహన్‌సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

సంస్కరణలు అమలు చేసి, ఈ దేశానికి ఆర్థిక స్వేచ్ఛతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

ఆదివాసీ బహుభాషా ఉపాధ్యాయులు సంతాపం

సీతంపేట : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరనిలోటని ఆదివాసీ బహుభాషా ఉపాధ్యాయుల సంఘం సమన్వయకర్త సవర డోంబు అన్నారు సీతంపేటలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపి ఆదివాసీ మాతృ బాషా ఉపాధ్యాయులు ఎల్లంగో ఆనందరావు, భారతి, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీకాలేజీలో...

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సుశాంత్ జానా పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, శంకర్రావు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణ సంతాపం

పాలకొండ : మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థిక, మౌలిక సదుపాయాల ప్రకృతి దశ్యాన్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషించారని, ఆయన రచనలు మన చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు.

డిగ్రీ కాలేజీలో

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఆర్థిక సంస్కరణ సారథి, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మతి పట్ల విద్యార్థులు, కళాశాల సిబ్బంది సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మన్మోహన్ సింగ్ చరిత్ర, జీవిత విశేషాలు, ఆర్థిక సంస్కరణలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డి రామయ్య, ఐక్యూ ఎసి మెంబర్ కల్పన ఉన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

గ్రామాల్లో ప్రచారం చేస్తున్న బడిదేవర కొండ పరిరక్షణ కమిటీ సభ్యులు

బడిదేవరకొండ పరిరక్షణ సమావేశాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని కోరి పంచాయతీ పరిధిలోని బడిదేవర కొండపై జరుగుతున్న అక్రమ గ్రానైట్ త్రవ్వకాలను ఆపాలని కోరుతూ బడిదేవరకొండ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం కోరిలో జరిగే విస్తృతస్థాయి సమావేశంలో పరిసర గ్రామ ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆటో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండలు, అడవులు తవ్వుకుంటూ పోతే పర్యావరణ ప్రతికుల పరిస్థితిలో బతుకులు చింద్రం అవుతాయని అన్నారు. వ్యవసాయం సర్వనాశనం అవుతుందన్నారు. గిరిజన ప్రజలకు బతుకులు లేని పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొండ తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు. శనివారం కోరి గ్రామంలో జరిగే సమావేశానికి అన్ని వర్గాల ప్రజలు పార్టీలకు అతీతంగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పాలక రంజిత్‌కుమార్, పోలా రమణి, కడ్రక రామస్వామి, బొత్స నర్సింగరావు, పి.సంగం, సిరిపురం విశ్వేశ్వరావు, నారాయణపురం రాజు, జన్ని ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి భాగస్వామ్యంతోనే ప్రగతి సాధ్యం : కలెక్టర్

ప్రజాశక్తి - మక్కువ

జిల్లాలోని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించు కోవాలని, ఇందుకు అవసరమైతే ప్రభుత్వం తరపున కొత్తగా మరుగుదొడ్లను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లను ఆదేశించారు. మండలంలోని అనసభద్రను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఆ గ్రామంలో పల్లెపండగలో భాగంగా కొత్తగా నిర్మించిన కాలువలు, మరుగుదొడ్లు, జల్ జీవన్ మిషన్ తదితర పదకాల అమలు తీరును స్వయంగా పరిశీలించి, గ్రామస్తులతో నేరుగా మాట్లాడారు. మురుగునీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించు కోవడం లేదని అన్నారు. బహిరంగ మలవిసర్జన లేని జిల్లాగా పార్వతీపురంను తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమష్టి కృషితోనే ఇది సాధ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఎన్ని పథకాలు అమలు చేసినప్పటికీ ప్రజలు సక్రమంగా వినియోగించుకోకుంటే అవి నిష్ప్రయోజనం అవుతాయని ఉద్బోదించారు. జిల్లాలో మరుగు దొడ్డి లేని ఇళ్లు ఉండరాదని, స్థలాభావం ఉన్న ఇళ్లకు దగ్గరలో గల ప్రభుత్వ స్థలంలో సామాజిక మరుగు దొడ్లను నిర్మించి, వాటి నిర్వహణను బాధ్యత గల వ్యక్తులకు అప్పగించాలని కలెక్టర్ సూచించారు. పల్లె పండగ కింద గ్రామంలో నిర్మించిన మురుగునీటి కాలువలను పరిశీలించిన ఆయన నిర్దేశించిన కొలతల మేరకు నిర్మాణాలు చేపట్టినదీ, లేనిదీ తనిఖీ చేశారు. జల్ జీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కొళాయిలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేస్తూ, మిగిలిన గృహాలకు కూడా తాగునీటి కొళాయిలను మంజూరుచేయాలని ఇంజినీర్లను ఆదేశించారు. అనంతరం అదే గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించి, అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించిన ఆయన విద్యార్థుల విద్యా ప్రమాణాలను గమనించారు. పిల్లలకు నాణ్యమైన విద్యను, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి వి.ఎస్.నగేష్ బాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సీతంపేటలో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక మెయిన్ రోడ్‌లో శుక్రవారం సాయంత్రం ఎస్సై వై.అమ్మనరావు డ్రింకింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరిని ఉండాలన్నారు. లైసెన్స్, సి -బుక్, ఇన్సూరెన్స్ లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు .

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ భూ సమస్యలకు పరిష్కారం జరుగుతుందని స్థానిక తహశీల్దార్ జయలక్ష్మి తెలిపారు. మండలంలోని గోచెక్క పంచాయతీ టొంకిలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో గ్రామపరిధిలోని రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించినట్లుగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

సీతానగరం : భూ సమస్య పరిష్కారానికి రెవెన్యూ సదస్సులో ఎంతో ఉపయోగం తహశీల్దార్ ప్రసన్న కూమార్ అన్నారు. మండలంలలోని అర్ వెంకంపేట, కొత్తవలసలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే దీర్ఘకాలిక భూ సమస్యలకు ఈ సదస్సులో దరఖాస్తులు అందజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు శ్రీనివాసరావు, విఆర్ఒ, గ్రామ పెద్దలు, అర్జీదారులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని నందాపురంలో రెవెన్యూ సదస్సు తహశీల్దార్ శివయ్య ఆధ్వర్యాన జరిగింది. ఈ సదస్సులో 15 దరఖాస్తు వచ్చాయని, అందులో పట్టాదారు పాస్ పుస్తకంలో పేర్లు సరిచేయడం, అడంగల్‌లో పేర్లు మార్పుకు సంబంధించి దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ఇలాంటి సదస్సులను ప్రజలు వినియోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ మణి రామ్ రెవిన్యూ సదస్సును సందర్శించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యుటీ తహశీల్దార్, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం : సదస్సులో ఫిర్యాదు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

కొత్త బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

కొత్త బోర్లు మంజూరుకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో కొత్తగా మూడు బోర్లు మంజూరైనట్లు సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కొత్త బోర్లు తవ్వకం ప్రారంభించారు. ప్రతి ఏడాది పంచాయతీ పరిధిలో నీటి సమస్య కనిపిస్తుందని, ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరందించాలనే ఉద్దేశంతో బోర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

జంఝావతిపై పాలకులు కళ్లు తెరవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జంఝావతి ప్రాజెక్టుపై ఉత్తరాంధ్ర పాలకులు కళ్లు తెరవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. మండలంలోని నర్సిపురంలో ఆ సమితి రాష్ట్ర కార్యదర్శి గవిరెడ్డి రఘు, సత్య సింహ చక్రవర్తి, సమితి ప్రతినిధులు దేవుపల్లి సీతారాం పట్నాయక్, నల్ల బాలరామ్ నాయుడు, నెల్లి లక్ష్మునాయుడు, మేడిశెట్టి రామచంద్రరావు, వర్రి శివకష్ణ, చుక్క చంద్రరావు, బలగ శంకరరావు, వి.దాలినాయుడు కలిసి జంఝావతి కన్నీటియాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొమరాడ మండలం రాజలక్ష్మీపురం సమీపంలో ఉన్న జంఝావతి ప్రాజెక్టు నిరాధారణకు గురైందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై సమీక్షలు కూడా చేసే పరిస్థితులు లేవన్నారు. దీంతో ప్రాజెక్టు మూలనపడిందన్నారు. అతి చిన్న సమస్యను సైతం నెరవేర్చక వైసిపి, టిడిపి ప్రభుత్వాలు జంఝావతి ప్రాజెక్టును మూలకు చేర్చారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రబ్బరు డ్యాం, లిఫ్ట్ కెనాల్ ద్వారా 24, 640 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉన్నప్పటికీ, ఆ పరిస్థితి లేదన్నారు. జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేసి పూర్తిస్థాయి సాగునీరు అందించినట్లయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాజెక్టును ఎన్నికల హామీగా పబ్బం గడుపుతున్న ఉత్తరాంధ్ర పాలకుల కళ్లు తెరచి ప్రాజెక్టు విషయమై ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా ప్రయత్నించాలన్నారు. ఆయకట్టు గ్రామాల్లో పర్యటించి రైతులు, సర్పంచుల నుంచి దరఖాస్తులు తీసుకొని ముఖ్యమంత్రికి, ప్రధానమంత్రికి అందజేస్తామన్నారు. తాము చేపడుతున్న జంఝావతి కన్నీటి యాత్రకు చక్కని స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



నర్సిపురంలో కన్నీటియాత్ర నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు

గొడ్డలమ్మతల్లిని జుంబరిలో ఊరేగిస్తున్న గిరిజనులు

ఘనంగా కందికొత్తల పండగ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ జుంబరిలో కందికొత్తల పండగను శుక్రవారం గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబర్‌లో గిరిజనుల దేవతలైన గొడ్డలమ్మ, జాకరమ్మ తెచ్చి వారికి పండిన మొదట పంటలను పెట్టి పూజలు స్తామని తెలిపారు. వారం రోజుల తర్వాత చుట్టుపక్కల గ్రామాలకు దేవతలను తీసుకొని వెళ్తామన్నారు. అక్కడ గ్రామస్తులు బియ్యం, డబ్బులు దేవతలకు వేసి పూజలు చేస్తుంటారని, ఆఖరు రోజు గ్రామస్తులంతా పూజ చేసి అనుపు పండుగ నిర్వహించి దేవతలను అడవిలోకి తీసుకెళ్లి విడిచిపెట్టి వస్తుంటామని అన్నారు. ఇది తరతరాల నుంచి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రేట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణారావు, జన్నోడు. బిడ్డిక నాగభూషణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని తాడికొండలో కందికొత్తల పండుగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా కప్పరమ్మతల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. తాడికొండ గ్రామంలో నిర్వహించిన కందికొత్తలు పండుగలో పాల్గొని తోటి మహిళలుతో కలిసి సాంప్రదాయ నృత్యాలు చేశారు.

రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

పో ష క విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పి లలిత విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దశమంతపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన అవగాహన కల్పించారు. సరైన ఆహారం తీసుకుపోతే పిల్లలు రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉందని, దీంతో ఎదుగుదల తగ్గడం, వ్యాధుల సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎం.పైడిరాజు తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

రక్తహీనతపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం రాజేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు అలాగే వాహనదారుడులు తప్పక లైసెన్సు హెల్మెట్ ధరించాలన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. పరిమితి మించి ప్రయాణికులను ఆటో డ్రైవర్లు ఎక్కించరాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు